# సాక్షి సూర్యాపేట

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024






**ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు**
చెర్వుగట్టులో శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి.
- IIలో



**చోరీల ముఠా అరెస్ట్**
ఇళ్ల సెంట్రింగ్ మెటీరియల్‌ను అపహరిస్తున్న దొంగల ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు.
- IIలో



**అధ్యయనోత్సవాలు**
యాదాద్రి శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అధ్యయనోత్సవాలు కొనసాగుతున్నాయి.
- IIలో

## న్యూస్‌రీల్

### నేడు ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

సూర్యాపేటటౌన్: టాస్క్ ఆధ్వర్యంలో అన్‌స్కూల్ కంపెనీ వారిచే శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు ముత్యాల, డైరెక్టర్ డాక్టర్ డి.కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌కు 2024లో బీటెక్, డిగ్రీ పూర్తి చేయనున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.5లక్షల వరకు ఉంటుందని తెలిపారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### కలెక్టర్‌ను కలిసిన జిల్లా అధికారులు



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న జెడ్పీసీఈఓ అప్పారావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఎన్నికల బదిలీలో భాగంగా జిల్లాకు కేటాయించిన పలువురు జిల్లా అధికారులు శుక్రవారం కలెక్టర్ వెంకట్రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారిలో జెడ్పీసీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, ఇన్‌చార్జ్ సీపీఓ శ్రీనివాస్, డిప్యూటీ సీఈఓ శిరీష ఉన్నారు.

### గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

సూర్యాపేట రూరల్: ఇటీవల సూర్యాపేట మండలంలోని ఇమాంపేట గురుకుల పాఠశాలలో బైపీసీ సెకండ్ ఇయర్ విద్యార్థిని డి వైష్ణవి ఆత్మహత్య చేసుకున్నందుకు గాను పలు ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రిన్సిపాల్‌ను విచారణ చేస్తున్నామని టీఎస్‌డబ్ల్యూ ఆర్ఈఐ సొసైటీ నల్లగొండ రీజనల్ అధికారి తెలిపారు.

### పేట మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

సూర్యాపేట : సూర్యాపేట మున్సిపల్ కమిషనర్‌గా బి.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పట్టణ ప్రజలు అందరూ సహకరించాలని కోరారు.

### యాదాద్రిలో ఊంజలి సేవ



అమ్మవారి సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఊంజలి సేవ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు, మాఢ వీధుల్లో భక్తుల సేవను ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారి సేవను అధిష్టించి ఊంజలి సేవోత్సవం జరిపించారు. ఆండాళ్ అమ్మవారికి ఇష్టమైన నాదస్వరాన్ని వినిపించారు. ఇక శ్రీస్వామి ప్రధానాలయంలో శ్రీస్వామి, అమ్మవారికి సంప్రదాయ పూజలు కొనసాగాయి.

### మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శుక్రవారం అర్చకులు వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం చేసి స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రక్తికట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ అనంతరం మాంగళ్యధారణ గావించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

## • కార్మికుల పోరు బాట



కేంద్రం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా శుక్రవారం సూర్యాపేట బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు




కోదాడలో గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న అఖిల పక్ష రైతు సంఘాల నాయకులు

## 24 నుంచి టీసీసీ పరీక్షలు

సూర్యాపేటటౌన్ : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఎగ్జామినేషన్‌లో డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని నాలుగు సెంటర్లలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. టైలరింగ్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు వారి వెంట కుట్టు మిషన్ తీసుకుని రావాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

# ఆ భూములు ఏ శాఖవి?

- నెమలిపురి, వజినేపల్లి సరిహద్దు భూములపై ఫారెస్ట్, రెవెన్యూ శాఖల మధ్య స్పష్టత కరువు
- గతంలో వజినేపల్లి రెవెన్యూ భూముల్లో రైతులకు పట్టాలు
- ఈ భూములు అటవీ శాఖవని స్వాధీనం చేసుకున్న అధికారులు
- సరిహద్దు వివాదంతో ఏళ్లుగా సాగుతున్న పంచాయితీ



దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఫారెస్ట్, రెవెన్యూ శాఖల భూ పంచాయితీ పట్టాలున్న రైతులకు భూములు లేకుండా చేసింది. చింతలపాలెం మండల పరిధిలో నెమలిపురి, వజినేపల్లి గ్రామాల భూములపై రెండు శాఖల మధ్య ఏర్పడ్డ భూ వివాదం కొందరు రైతులకు శాపంగా మారింది. ఈ గ్రామాల్లోని భూములు తమ శాఖకే చెందుతాయని రెండు శాఖలు వాదిస్తున్నాయి. రెండు గ్రామాల భూములపై ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది.

**రెండు సర్వే నంబర్లు పక్కపక్కనే ఉండటంతో..**

చింతలపాలెం మండలం వజినేపల్లి గ్రామంలో రెవెన్యూ రికార్డు ప్రకారం సర్వే నంబర్ 52లో 636 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ సర్వే నంబర్‌లో 1988లో కుటుంబ నియంత్రణ చేయించుకున్న 40 కుటుంబాలకు 3 ఎకరాల చొప్పున 120 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఇదే మండలం నెమలిపురిలో సర్వే నంబర్ 316లో అగ్రహారానికి చెందిన రెవెన్యూ భూములను 1962లో హైదరాబాద్ ఫారెస్ట్ యాక్ట్ కింద సర్వే నంబర్ 318గా మార్చుతూ అటవీ భూములకు కేటాయించారు. ఇక్కడ రికార్డుల ప్రకారం తమశాఖకు 1989 ఎకరాల భూమి ఉన్నదని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఈ రెండు సర్వే నంబర్లు పక్కపక్కనే ఉండటంతో సరిహద్దు వివాదం మొదలైంది. వజినేపల్లి గ్రామంలోని సర్వే 52లో గల రెవెన్యూ భూములను ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ తమ భూములుగా చూపిస్తూ ఈ సర్వే నంబర్‌లోని మొత్తం భూమిని వారి ఆధీనంలోకి తీసుకున్నారు. అంతే కాకుండా ఈ సర్వే నంబర్‌లో పట్టాలు పొందిన రైతులను భూమిపైకి రాకుండా అడ్డుకుంటున్నారు. అయితే నెమలిపురి గ్రామంలోని సర్వే 316లో ఎంత భూమి ఉందో తెలియకుండానే రికార్డులో నమోదైన ప్రకారం 318 సర్వేగా మార్చి అటవీ శాఖకు కేటాయించడంతో ఈ వివాదం వచ్చిందని, ఈ సర్వే నంబర్‌లో రికార్డుల్లో ఉన్నంత భూమి స్థానికంగా లేదని, కానీ రికార్డుల ప్రకారం రెండు గ్రామాల సరిహద్దులను అటవీ శాఖ ఓవర్‌లాప్ చేసినట్లు రెవెన్యూశాఖ అధికారులు ఆరోపిస్తున్నారు.

**ఏళ్లుగా సాగుతున్న వివాదం..**

వజినేపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 52లో పట్టాలు పొందిన రైతులు కొన్ని సంవత్సరాల పాటు భూములను సాగు చేసుకున్నారు. 2014 తరువాత భూములపైకి ఫారెస్ట్ అధికారులు వస్తుండటంతో 2018లో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో 1962లో రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం సరిహద్దు రాజీనామా చేసుకోవాలని హైకోర్టు సూచించినట్లు సమాచారం. హైకోర్టు ఆదేశాల ప్రకారం 2020లో రెండుశాఖలు సరిహద్దు రాజీనామా చేసి లాండ్ సర్వే శాఖ కమిషనర్‌కు రిపోర్టు అందించారు. 2023 జనవరిలో సెక్షన్ 90 ప్రకారం రైతులకు పట్టాలు ఇస్తూ ఆన్‌లైన్లో నమోదు చేయాలని లాండ్ సర్వే శాఖ కమిషనర్ ఆదేశించారు. కానీ నేటికీ ఈ సమస్యపై రెండు శాఖల మధ్య వివాదం మాత్రం కొనసాగుతూనే ఉంది. కలెక్టర్ స్పందించి గతంలో తమకు కేటాయించిన భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేసి నూతన పట్టాలు ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

**ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాలు ఇవ్వాలి**

1988లో మా కుటుంబానికి వజినేపల్లి సర్వే 52లో ప్రభుత్వం కేటాయించిన 3 ఎకరాల భూమిని నాటి నుంచి సాగు చేసుకుంటున్నాం. 2014 తరువాత ఈ భూములు తమవని అటవీ శాఖ అధికారులు అంటున్నారు. అయితే కోర్టును ఆశ్రయించగా సర్వే చేసి రెవెన్యూ భూములుగా గుర్తించారు. కానీ నేటికీ ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదు.

– రాములు నాయక్

**అటవీ భూముల లెక్క చూపాలి**

మా రికార్డు ప్రకారం 318 సర్వే నంబర్‌లో ఉన్న 1360 ఎకరాల ఫారెస్ట్ భూమి చూపించాలని రెవెన్యూ అధికారులను అడుగుతున్నాం. కానీ వారు లెక్క చూపకుండా వజినేపల్లి సర్వే 52లోకి అటవీ భూమి సరిహద్దులు వచ్చాయని, సరిహద్దు ఓవర్ లాప్ అయిందని వాదిస్తున్నారు. కానీ మా భూమి లెక్క చూపడం లేదు.

– సతీశ్, డీఎఫ్‌ఓ

# అంగన్‌వాడీ కొలువులపై ఆశలు

- ఖాళీలను నింపే యోచనలో ప్రభుత్వం
- వివరాలు సేకరిస్తున్న అధికారులు
- యువతులకు లభించనున్న ఉద్యోగ అవకాశాలు

హుజూర్‌నగర్ : అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఖాళీగా ఉన్న కేంద్రాల్లో సిబ్బందిని భర్తీ చేయడం ద్వారా వాటిని సమర్థవంతంగా నడిపించవచ్చని భావిస్తోంది. దీంతో ఉపాధ్యాయురాళ్లు, సహాయకుల పోస్టుల భర్తీపై నిరుద్యోగ యువతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయో సంబంధిత సంక్షేమ శాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి ప్రకటన విడుదల కాగానే వాటి భర్తీకి దరఖాస్తులు సేకరించేలా అధికారులు సమాయత్తం అవుతున్నారు.

**5 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో..**

జిల్లాలో మొత్తం 23 మండలాలు, ఐదు మున్సిపాలిటీలు ఉండగా వాటిలో 5 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 1,209 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో గర్భిణులు 6,080 మంది ఉండగా, బాలింతలు 4,380 మంది ఉన్నారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 6 నెలలలోపు చిన్నారులు 4,561 మంది, 7 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 28,250 మంది ఉన్నారు. 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 18,612 మంది ఉన్నారు. ఇందుకుగాను మొత్తం 239 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. మొత్తం 1,209 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,126 మెయిన్, 83 మినీ కేంద్రాలు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం మినీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసిన విషయం తెలిసిందే. వాటిల్లో లబ్ధిదారుల సంఖ్యకు తగినట్లుగా సిబ్బంది అందుబాటులో లేరు. ఇటీవల మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో సహాయకుల పోస్టులూ పెరిగాయి. దీనిప్రకారం 59 ఉపాధ్యాయ పోస్టులు, 180 సహాయకుల (ఆయాల) పోస్టులు మొత్తం కలిపి 239 పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని జిల్లా అధికారులు జాబితా రూపొందించారు. అయితే కొన్ని కేంద్రాల్లో టీచర్, ఆయా లేకపోవడంతో సమీప కేంద్రాల వారికి ఇన్‌చార్జ్‌లకు బాధ్యతలు అప్పగించారు. దీంతో వాటి సేవల్లో అంతరాయం కలుగుతోంది. లబ్ధిదారులకు కూడా పోషకాహారం సరిగా అందకపోవడం, ఎన్‌హెచ్‌టీస్ (న్యూ హెల్త్ ట్రాకింగ్ సిస్టం) పోషణ ట్రాకర్‌లో వివరాల నమోదులో కూడా ఆలస్యం జరుగుతోంది. అంగన్‌వాడీల పోస్టుల భర్తీతో ఆయా సమస్యలు తీరడంతో పాటు యువతులకు నూతనంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

**ఖాళీల జాబితా సిద్ధం చేస్తున్నాం**



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎన్ని ఖాళీలు ఉన్నాయనే జాబితా సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం త్వరలో ఆయా ఉద్యోగ నియామకాల మార్గదర్శకాలను విడుదల చేస్తుంది. ప్రభుత్వ ఉత్తర్వులు, నియమ నిబంధనల ప్రకారం ఖాళీలను నింపేందుకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

– జ్యోతి పద్మ, జిల్లా సంక్షేమ అధికారి, సూర్యాపేట

**మారుతున్న విద్యార్హత..**

గతంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత కావాలని నిబంధన ఉండేది. తాజాగా అందిన మార్గదర్శకాల ప్రకారం విద్యార్హతను ఇంటర్మీడియట్‌కు పెంచుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సాంకేతిక వినియోగం, ఆన్‌లైన్ రికార్డుల నమోదు, ఆండ్రాయిడ్ మొబైల్ యాప్‌ల ద్వారా రోజువారీ కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వయసు 18 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలి. మొత్తం ఖాళీల్లో అర్హులైన సహాయకులు ఉంటే ఉద్యోగోన్నతుల ద్వారా ఆయా ఖాళీలను భర్తీచేస్తారు. మిగిలిన వాటిని నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు.

# పోస్టాఫీసులో ఆధార్ సేవలు



మాట్లాడుతున్న జిల్లా తపాలా సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్: ఆధార్ కార్డులో తప్పుల సవరణ, బయోమెట్రిక్ నమోదును పోస్టాఫీసులో చేసుకోవచ్చని జిల్లా తపాలా సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని తపాలా కార్యాలయంలో గ్రామీణ తపాలా ఉద్యోగులకు ఐపీపీబీ మొబైల్‌లో సీఈఎల్‌సీ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రతి ప్రభుత్వ పథకానికి ఆధార్ కార్డ్ ప్రధానమని చెప్పారు. గ్రామీణ తపాలా ఉద్యోగులను ఈ యాప్‌కు ఆపరేటర్లుగా నియమించినట్లు తెలిపారు. ఇక నుంచి అప్పుడే పుట్టిన పిల్లలకూ ఆధార్ నమోదు చేసుకోవచ్చని, ఆధార్‌లో తప్పుల, బయోమెట్రిక్ సవరణతోపాటు, మొబైల్ నంబర్ లింక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి సేవలకు నామమాత్రంగా రూ.50 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. పిల్లల ఆధార్ నమోదును ఉచితంగా చేయడం జరుగుతుందని ప్రతి పోస్టాఫీస్‌లో ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తపాలా అధికారులు రాజేష్ రెడ్డి, సందీప్, ఉద్యోగులు కోటయ్య, మతీన్, గ్రామీణ తపాలా ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐదు మీసేవ కేంద్రాలు మంజూరు

దురాజ్‌పల్లి: జిల్లాలోని నాలుగు మండలాల్లో ఐదు మీసేవ కేంద్రాలు మంజూరు చేసినట్లు, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24 నాటికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వెంకట్రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేటలో మున్సిపల్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, హుజూర్‌నగర్‌లో పోస్టాఫీసు ఎదురుగా, తుంగతుర్తి, కోదాడలో మొత్తం ఐదు నూతన మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం, డిగ్రీ ఆపై విద్యార్హతలు కలిగి, 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు కలెక్టరేట్‌లోని ఇన్‌వార్డ్ విభాగంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

# క్రీడాకారులు జిల్లాకు పేరు ప్రతిష్టలు తేవాలి



కబడ్డీ జిల్లా జట్టుకు టీషర్టులు అందజేస్తున్న రామచంద్రగౌడ్

హుజూర్‌నగర్ : కబడ్డీ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ రామచంద్రగౌడ్, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు దేవరం రవీందర్‌రెడ్డి అన్నారు. చింతలపాలెం మండలంలో నిర్వహించే 33వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు హాజరయ్యే జిల్లా బాలుర, బాలికల కబడ్డీ జట్లకు ప్రత్యేక్ష శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. శిక్షణలో 20మంది చొప్పున బాల బాలికలు పాల్గొనగా వారి నుంచి ప్రధాన జట్టుకు 12మందిని ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారులకు శ్రీ వివేకవర్ధిని గోశాల నిర్వాహకులు దేవరం రాజ్యలక్ష్మీ రవీందర్‌రెడ్డి క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కోచ్‌లు కస్తాల సునీల్‌కుమార్, మేనేజర్ వడ్లమూడి మస్తాన్, రామిశెట్టి మురళి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ బాలకృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

# భళా.. బాల శాస్త్రవేత్తలు

- ఇటీవల ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ మనక్ పోటీల నిర్వహణ
- జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ఐదు ప్రాజెక్టులు ఎంపిక

సూర్యాపేటటౌన్: బాల్య దశలోనే విద్యార్థులను విజ్ఞానం వైపు మళ్లించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వైజ్ఞానిక మేళాలు, ప్రేరణ కార్యక్రమాలు చేపడుతోంది. ఇటీవల జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా ఇన్‌స్పైర్ మనక్ నిర్వహించారు. ఈ పోటీలో జిల్లా నుంచి 60 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రాజెక్టుల నమూనాల కోసం ఒక్కో విద్యార్థికి రూ.10వేల చొప్పున విడుదలయ్యాయి. వీరు ఇన్‌స్పైర్ మనక్ పోటీలో పాల్గొనగా ఐదు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు జిల్లా సైన్స్ అధికారి ఎల్.దేవరాజు తెలిపారు.

### సైకిల్ ద్వారా విత్తనాలు నాటే యంత్రం

విద్యార్థి : సీహెచ్.పావని
గైడ్ టీచర్ : బి.సర్దార్‌సింగ్
స్కూల్: జెడ్పీహెచ్ఎస్, పాత సూర్యాపేట

ఒక సైకిల్‌ను తీసుకొని దానికి ముందు వీల్‌కు నాలుగు పారలు అమర్చాలి. మధ్యలో ఒక బొంగు ఏర్పాటు చేసి దానిలో విత్తనాలు నింపాలి. ఒక వ్యక్తి సైకిల్ నెట్టుకొంటు వెళ్తుంటే ముందు పారలు గుంతలు తీస్తాయి. ఆ గుంతల మధ్యలో ఉన్న బొంగులో నుంచి విత్తనాలు పడుతుంటాయి. సైకిల్ వెనుక వీల్‌కు ఇంకో పార అమర్చాలి. ఈ పార ఆ గుంతలను పూడ్చుకుంటూ వెళ్తుంది. దీని వల్ల నలుగురు చేసే పని ఒక్కరే చేసుకోవచ్చు.



సైకిల్ ద్వారా విత్తనాలు నాటే యంత్రం చూపుతున్న విద్యార్థి, గైడ్ టీచర్

### వాటర్ ప్రూఫ్ స్కూల్ బ్యాగ్ విత్ సీటింగ్ చైర్

విద్యార్థి పేరు : చల్లా శోభన్‌బాబు
గైడ్ టీచర్ : ఎం.వెంకటేశ్వర్లు
స్కూల్ : బండరామారం జెడ్పీహెచ్ఎస్



ఒక వాటర్ ప్రూఫ్ బ్యాగ్ తీసుకొని దానికి పీవీసీ పైపులు రింగులా చేసి, బ్యాగ్‌కు పైపులు చైర్ వలే అటాచ్ చేశారు. బ్యాగ్ వేసుకొని స్కూల్‌కు వెళ్లేటప్పుడు మధ్యలో అలసిపోయినట్లయితే ఆ చైర్‌లో కొద్ది సేపు కూర్చొని సేద తీరొచ్చు.

### లైఫ్ సేవింగ్ స్టిక్

విద్యార్థి : ఎం.ప్రేమ్‌కుమార్
గైడ్ టీచర్ : రవీందర్‌రెడ్డి
స్కూల్ : కర్విరాల మోడల్ స్కూల్, నడిగూడెం మండలం



లైఫ్ సేవింగ్ స్టిక్

రైతులు రాత్రి పూట పొలం దగ్గరకు వెళ్లేటప్పుడు ఈ లైఫ్ సేవింగ్ స్టిక్ ఉపయోగపడుతుంది. ఈ స్టిక్‌ను తయారు చేయడానికి సుమారు మూడు ఫీట్ల పొడవు ఉన్న ఒక పీవీసీ పైపును తీసుకొని దానికి బ్యాటరీలు, వైబ్రేషన్ వచ్చేందుకు సెన్సార్, ఎల్ఈడీ లైట్‌లు అమర్చారు. రాత్రి పూట పొలంలో తిరుగుతున్నప్పుడు ఆ స్టిక్ ఉంటే రైతులకు దారి కనబడుతుంది. స్టిక్ వైబ్రేషన్ చేయడంతో దారిలో ఏమైనా విష పురుగులు ఉంటే పక్కకు వెళ్లిపోతాయి.

### పాత్ హోల్ డిటెక్షన్ కెమెరా టు వెహికిల్స్ ఆన్ కచ్చా రోడ్

విద్యార్థి పేరు : జకటి యసోష్
గైడ్ టీచర్ : కె.గురుమూర్తి
స్కూల్ : గట్టికల్ జెడ్పీహెచ్ఎస్

మనం నిత్యం రోడ్లపై ప్రమాదాలు చూస్తూనే ఉంటాం. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. వాటిలో రోడ్లపై ఏర్పడ్డ గుంతలను దూరం నుంచి డ్రైవర్ సరిగా చూడలేక పోవడం ఒక కారణం. దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలను నివారించడానికి వాహనాల ముందు కింది భాగాన కెమెరా అమర్చి దానికి క్యాబిన్‌లో అమర్చిన స్క్రీన్‌లో చూసి ఆ గుంతలను తప్పిస్తూ వాహనాన్ని నడిపి ప్రమాదాలను నివారించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం.



పాత్ హోల్ డిటెక్షన్ కెమెరా టు వెహికిల్స్ ఆన్ కచ్చా రోడ్ ప్రాజెక్టు

### వెజిటేబుల్ డ్రయర్ విత్ ఇన్‌డైరెక్ట్ సోలార్ ఎనర్జీ

విద్యార్థి పేరు : ఎం.గాయత్రి
గైడ్ టీచర్ : ఎస్.శ్రీనివాసరావు
స్కూల్: నర్సింహులగూడెం, జెడ్పీహెచ్ఎస్

ఈ పరికరాన్ని చెక్క, గ్లాస్, ఇనుముతో తయారు చేశారు. ఈ పరికరంతో కూరగాయలు, ఒరుగులు, చేపలు, మాంసం వంటివి త్వరగా ఎండబెట్టుకోవచ్చు. ఎండకు అనువుగా అటు ఇటు కదల్చనవసరం లేదు. ఎలాంటి కాపలా అవసరం లేదు. కోతులు, పక్షులు, కీటకాలు, దుమ్ము నుంచి రక్షణ కల్పిస్తుంది. ప్రతి ఇంటిలో తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చు. నిర్వహణ ఖర్చు ఏమీ ఉండదు.



వెజిటేబుల్ డ్రయర్ విత్ ఇన్‌డైరెక్ట్ సోలార్ ఎనర్జీ ప్రాజెక్టు

## క్లుప్తంగా

### స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా సుధీర్‌రెడ్డి



**తిరుమలగిరి:** తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన సంకెపల్లి సుధీర్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా నియమించింది. ఆయన ఫైనాన్స్ కమిషన్‌లో రెండు సంవత్సరాలు సభ్యుడిగా ఉంటారు. ప్రస్తుతం సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### చెట్టు పైనుంచి పడి యువకుడు మృతి

**బీబీనగర్:** చెట్టు పైకి ఎక్కి చింతకాయలు తెంపుతున్న యువకుడు కాలుజారి కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం బీబీనగర్ మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన పెరుమాళ్ల ఉపేందర్(28) శుక్రవారం తన ఇంటి సమీపంలో చింతచెట్టు ఎక్కి చింతకాయలు తెంపుతుండగా కాలుజారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఉపేందర్‌ను స్థానికులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### కారు ఢీకొని మహిళ దుర్మరణం

**మిర్యాలగూడ:** నడుచుకుంటూ వెళ్తున్న మహిళను కారు ఢీకొనడంతో మృతిచెందింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి దామరచర్ల మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన కోటేశ్వరి (48) నడుచుకుంటూ అద్దంకి–నార్కట్‌పల్లి రహదారి దాటుతుండగా అదే సమయంలో మిర్యాలగూడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కోటేశ్వరికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు కోటేశ్వరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### విద్యుదాఘాతంతో రైతు మృతి



లింగయ్య మృతదేహం

**పెన్‌పహాడ్:** వ్యవసాయ పొలం వద్ద బోరు మోటారు ఆన్ చేసేందుకు వెళ్లిన రైతు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండలం మహ్మదాపురంలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మదాపురం గ్రామానికి చెందిన బొలిశెట్టి లింగయ్య(66) శుక్రవారం తన సొంత వ్యవసాయ పొలంలో బోరు మోటారు ఆన్ చేసేందుకు వెళ్లాడు. మోటారు ఆన్ చేసిన తర్వాత నీరు రాకపోవడంతో బోరు మోటారు పైపును పట్టుకోగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పొలం వద్దకు వెళ్లిన లింగయ్య ఎంతసేపయినా రాకపోయేసరికి అతడి భార్య కమలమ్మ వెళ్లి చూడగా.. లింగయ్య విగతజీవిగా పడి ఉన్నాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



# కనుల పండువగా రథసప్తమి వేడుకలు

- తిమ్మాపురం సూర్యనారాయణస్వామి క్షేత్రానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- క్షేత్రాన్ని సందర్శించిన శ్రీకామాక్షి భక్తి ప్రచార పీఠం పీఠాధిపతి విద్యానరేంద్ర సరస్వతి స్వామి



స్వామివారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు



విద్యానరేంద్ర సరస్వతి స్వామి



స్వామివారి పాదాలను తాకిన సూర్యకిరణాలు

**అర్వపల్లి:** జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని సూర్యనారాయణస్వామి క్షేత్రంలో శుక్రవారం రథసప్తమి వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం సూర్యకిరణాలు సూర్యనారాయణస్వామి పాదాలను తాకాయి. సుప్రభాత సేవ, అభిషేకం, అలంకరణ అనంతరం భక్తులకు స్వామి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్త బృందాలచే భజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా క్షేత్రానికి తరలివచ్చిన సుమారు పదివేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కాగా రథసప్తమి వేడుకల్లో శ్రీకామాక్షి భక్తి ప్రచార పీఠం పీఠాధిపతి విద్యానరేంద్ర సరస్వతి స్వామి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ప్రవచనాలు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు నుంచి అంబికా దర్బార్ సంస్థ వారు పంపిన ఐదు అడుగుల అంబికా దర్బార్ అగర్బత్తిని వెలిగించారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన్‌స్వామి, కర్నాటి నాగేశ్వర్‌రావు, దేవరశెట్టి వెంకటేశ్వర్లు, గణపురం నరేష్, బాలమురళీకృష్ణ, గిరిధర్, మణికంఠ, వేదపండితుడు మూర్తి శ్రీనివాసశర్మ, అర్చకులు పాల్గొన్నారు.

## యాదాద్రిలో వైభవంగా రథసప్తమి



రథసప్తమిని పురస్కరించుకొని యాదాద్రిలో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లు



తూర్పు రాజగోపురం ముందు రథసప్తమి వేడుక విశిష్టతను వివరిస్తున్న ఆలయ ప్రధానార్చకులు

# ప్రత్యేక పూజలతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న ఆర్డీఓ రవి, డీఎస్పీ శివరాంరెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప





విద్యుత్ దీపాల వెలుగుల్లో చెర్వుగట్టు మెట్ల మార్గం

**నార్కట్‌పల్లి:** రథసప్తమి సందర్భంగా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో కొలువైన శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. నల్లగొండ ఆర్డీఓ రవి, డీఎస్పీ శివరాంరెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప తదితరులు ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకుడు రామలింగేశ్వరశర్మ, అర్చక బృందం పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచం, దీక్షాదహణ, ఏకాదశ రుద్రాభిషేకం, నీరాజన మంత్ర పుష్పములు వంటి పూజలతో వేద పండితుడు అల్లవరపు సుబ్రహ్మణ్య శాస్త్రి, నీలకంఠ శర్మ, దేవాలయ ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ, సురేశ్‌శర్మ, శ్రీకాంత్ శర్మ, సతీష్, నాగయ్య బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆర్డీఓ రవి, డీఎస్పీ శివరాంరెడ్డి మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మహేంద్ర కుమార్, కార్యనిర్వహణ అధికారి నవీన్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మాజీ సర్పంచ్ నేతగాని కృష్ణ, వారాల రమేష్, వడ్డే భూపాల్‌రెడ్డి, గడుసు శశిధర్‌రెడ్డి, పున్నపురాజు యాదగిరి, రేగట్టె నవీన్‌రెడ్డి, రేగట్టె నర్సింరెడ్డి, మల్గ శంకర్, బండమీది లింగయ్య తదితరులు పాల్గొన్నారు. శనివారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

### భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి అధికారులకు సూచించారు. చెర్వుగట్టులోని శ్రీపార్వతీజడల రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఆమె దేవస్థానానికి వచ్చి గట్టు పైన, కింద వివిధ ప్రదేశాలు, కల్యాణ మండపం ప్రాంతాన్ని పరిశీలించారు. కల్యాణం ఏర్పాట్లపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట డీఎస్పీ శివరాంరెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్ర కుమార్, ఆలయ అధికారి నవీన్‌కుమార్, సీఐ నాగరాజు, ఎస్‌ఐ అంతిరెడ్డి ఉన్నారు.



చెర్వుగట్టులో అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ చందనా దీప్తి

# కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు



ఆలయంలో పారాయణం పఠిస్తున్న ఆచార్యులు, పారాయణీకులు



స్వామి వారి సేవను ఆలయ పుర వీధిలో ఊరేగిస్తున్న ఆచార్యులు

**యాదగిరిగుట్ట:** యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం ఆలయాన్ని తెరచిన ఆచార్యులు.. నిత్యారాధనలు జరిపించి, తిరుమంజన మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అలంకరించి పురప్పాట్ సేవ ను ఆలయ పుర వీధిలో ఊరేగించారు. సాయంత్రం నిత్యారాధనలు జరిపించిన తర్వాత దివ్య ప్రబంధ సేవా కాలం నిర్వహించి, స్వామి, అమ్మవారు, ఆళ్వారుల పురప్పాట్ సేవను నిర్వహించారు. ఆయా వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, ఆలయాధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సప్త వాహనాలపై ఊరేగింపు

**మఠంపల్లి:** మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామిని సప్త వాహనాలపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలుచేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



సింహవాహనంపై నృసింహస్వామి, అమ్మవార్లు

# బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరు మృతి



మద్దెల శ్రీను (ఫైల్)



రాంబాబు (ఫైల్)

**మిర్యాలగూడ అర్బన్:** బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో గురువారం రాత్రి జరిగింది. వివరాలు.. మిర్యాలగూడలోని నందిపాడు సమీపంలో గల నవనీత వైన్స్ పర్మిట్ రూంలో శాంతినగర్‌కు చెందిన రుద్రాక్ష రాంబాబు(38), మద్దెల శ్రీను(26) సప్లయర్స్‌గా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి తమ విధులు ముగించుకుని వారిద్దరు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి నందిపాడు క్రాస్ రోడ్డు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబు, శ్రీను అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ కనకేష్‌ను అదుపులోకి తీసుకుని కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతుడు రాంబాబుకు భార్య విజయలక్ష్మి, కుమార్తె అంజలి, కుమారుడు అనిల్ ఉన్నారు. మద్దెల శ్రీను స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా పులివెందుల దగ్గర ఓ గ్రామం కాగా మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డలో ఉంటున్నట్లు తెలిసింది. రాంబాబు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు.

### లారీ ఢీకొని..



శంకర్ (ఫైల్)

**భువనగిరి క్రైమ్:** బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందారు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి పట్టణంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్‌లోని చిలకానగర్‌కు చెందిన కడియాల శంకర్(48) ఇళ్లలో టైల్స్ వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం భువనగిరి పట్టణంలోని టీచర్స్ కాలనీ వద్ద పనులు ముగించుకుని హబ్సిగూడకు చెందిన చంద్రశేఖర్‌తో కలిసి బైక్‌పై ఉప్పల్‌కు వెళ్తుండగా భువనగిరి పట్టణంలోని చెరువు కట్ట వద్ద లారీ ఒక్కసారిగా బైక్ పైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతిచెందగా, చంద్రశేఖర్‌కు గాయాలయ్యాయి. శంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

**మోత్కూరు:** బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడి గాయాలపాలైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. వివరాలు.. మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన వంగాల బుద్రుడు (35) బుధవారం బైక్‌పై వెళ్తూ మోత్కూరు మండలంలోని పనకబండ సమీపంలో అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. శుక్రవారం బుద్రుడు భౌతికకాయానికి యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు దాసరి తిరుమలేష్, జిట్ట సాయికుమార్, దాసరి నవీన్‌కుమార్ తదితరులు నివాళులర్పించారు.

## ఐదుగురు జూదరుల అరెస్ట్

**దేవరకొండ:** మండల పరిధిలోని తాటికోల్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు. వారి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, రూ.64,640 నగదుతో పాటు నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

# రిజర్వు ఫారెస్ట్‌లో మైనింగ్‌పై వివరణ ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

**సాక్షి, హైదరాబాద్:** సూర్యాపేట జిల్లా మఠంపల్లి పరిధిలోని సుల్తాన్‌పూర్ రిజర్వు ఫారెస్ట్ ఏరియాలో అక్రమ మైనింగ్ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు అధికారులకు నోటీసులు జారీ చేసింది. సాగర్ సిమెంట్స్ మైనింగ్ విస్తరణ కోసం నిర్వహిస్తున్న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కొనసాగించవచ్చునని చెబుతూనే.. కోర్టు అనుమతి లేకుండా దానిపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోవద్దని స్పష్టం చేసింది. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మఠంపల్లి, పెద్దవీడు గ్రామాల్లో 328 ఎకరాల్లో సాగర్ సిమెంట్స్ మైనింగ్ లీజు పెంపు ప్రతిపాదనపై ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) గత నెల నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ మఠంపల్లి మండలానికి చెందిన పద్మతో పాటు 11 మంది హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. సాగర్ సిమెంట్స్ మైనింగ్ విస్తరణ చేపట్టిన 326 ఎకరాల ప్రాంత పరిధిలో రామచంద్రాపురం, గుర్రంబోడు, అంతియా, దుబ్బ, కాల్వపల్లి, దొనబండ, జామ్లు, సుల్తాన్‌పురం తదితర 33 తండాలున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది గోవింద్ తెలిపారు. అటవీ ప్రాంతంలో సాగర్ సిమెంట్స్ మైనింగ్ నిర్వహిస్తోందని, అది అక్కడి వారి జీవనోపాధిపై ప్రభావం చూపుతుందని.. ఆ లీజును రద్దు చేయాలంటూ గనుల శాఖ డైరెక్టర్‌కు అటవీశాఖ అధికారి లేఖ రాశారన్నారని చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణను నిలిపివేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. గిరిజనుల జీవితాల అంశంతో ముడిపడి ఉన్నందున ప్రభుత్వం స్పందించేదాకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోరాదని స్పష్టం చేసింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు పలువురు అధికారులకు, అలాగే సాగర్ సిమెంట్స్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా చేసింది.

# మత్తు ఇంజెక్షన్ వికటించి బాలిక మృతి !

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన



బాలిక మృతదేహం

**మిర్యాలగూడ అర్బన్:** కాలు విరిగిందని ఆస్పత్రికి వెళ్తే ఆపరేషన్ చేసేందుకు డాక్టర్ మత్తు ఇంజెక్షన్ ఇవ్వగా అది వికటించి బాలిక మృతిచెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటన మిర్యాలగూడలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం ఇర్కిగూడెం గ్రామానికి చెందిన దాసరి యల్లయ్య కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 14న తమ సమీప బంధువుల ఇంట్లో పండుగ ఉండగా యల్లయ్య కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో యల్లయ్య కుమార్తె మీనాక్షి(9) కాలు విరిగింది. దీంతో వెంటనే బాలికను మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డికాలనీలో గల సాయి ఎముకల వైద్యశాలకు తీసుకెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యుడు డాక్టర్ శ్రీనివాసరాజు ఆమె కాలుకు ఆపరేషన్ చేయాలని సూచించాడు. శుక్రవారం ఉదయం బాలికను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లిన వైద్యుడు అనస్తీషియా డాక్టర్ పర్యవేక్షణ లేకుండానే బాలికకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మత్తు ఇంజెక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే బాలిక అపస్మారకస్థితిలోకి పోవడంతో ఆపరేషన్ థియేటర్ నుంచి బయటకు వచ్చిన వైద్యుడు బాలిక పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని చెప్పి స్వయంగా అంబులెన్స్ ఏర్పాటు చేశాడని, బాలికను హైదరాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందిందని కుటుంబ సభ్యులు బోరు విలపించారు. డాక్టర్ ఎక్కువ మొత్తంలో మత్తు మందు ఇవ్వడంతోనే బాలిక మృతిచెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం రాత్రి బాలిక మృతదేహాన్ని మిర్యాలగూడకు తీసుకొచ్చి ఆస్పత్రి ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు.

**రూ.5లక్షలకు రాజీ..**

ఆందోళన చేస్తున్న బాలిక కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు వైద్యులతో మధ్యవర్తులు చర్చలు జరిపేందుకు రంగంలోకి దిగారు. గంట వరకు చర్చలు జరిపిన తర్వాత బాలిక బంధువులు రూ.50లక్షలు డిమాండ్ చేయగా.. చివరకు రూ.5లక్షలు చెల్లించేందుకు మధ్యవర్తులు రాజీ కుదర్చడంతో ఆందోళన విరమించి బాలిక మృతదేహాన్ని తీసుకెళ్లారు.

# భార్య మృతికి కారణమైన భర్తకు జైలు శిక్ష

**మిర్యాలగూడ టౌన్:** భార్య మృతికి కారణమైన భర్తకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మిర్యాలగూడ ఐదవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జి. వేణు శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మణెమ్మకు అదే గ్రామానికి చెందిన గంధం బాలసైదులుతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. మూడేళ్ల పాటు వీరి కాపురం సజావుగానే సాగింది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు పుట్టారు. ఆ తర్వాత ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న బాలసైదులు తన భార్య మణెమ్మకు ఇతరులతో వివాహేతర సంబంధం కలిగి ఉందనే అనుమానంతో తరచూ ఆమెను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేయడంతో పాటు అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధించేవాడు. ఆ వేధింపులు తట్టుకోలేక 2016 డిసెంబరు 29న మణెమ్మ ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. కాలిన గాయాలతో మణెమ్మ మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అప్పటి న్యాయమూర్తి ఎం. పద్మజ వాంగ్మూలం తీసుకుంది. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం ఆమెను హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ 2017 జనవరి 3వ తేదీన మృతి చెందింది. దీంతో అప్పటి మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ కె. శ్రీకాంత్ నిందితుడు బాలసైదులుపై కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ రాంగోపాల్‌రావు దర్యాప్తు చేసి చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. అప్పటి న్యాయమూర్తి పద్మజకు మణెమ్మ ఇచ్చిన వాంగ్మూలంను పరిశీలించిన ప్రస్తుత మిర్యాలగూడ 5వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జి. వేణు నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. జరిమానా కట్టకపోతే మరో ఆరు నెలలు జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పీపీ మన్నెం మనోహర్‌రెడ్డి వాదించగా ప్రాసిక్యూషన్‌కు కోర్టు లైజన్ అధికారి సైదులు, కోర్టు కానిస్టేబుళ్లు కిషన్, జానకిరాములు సహకరించారు.

# సెంట్రింగ్ మెటీరియల్ చోరీ చేస్తున్న ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

**చిట్యాల:** ఇంటి స్లాబు నిర్మాణంలో వాడే సెంట్రింగ్ మెటీరియల్ ఎత్తుకెళ్తున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను చిట్యాలలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం డీఎస్పీ విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన ఐరన్ స్క్రాప్ వ్యాపారం చేసే సబావత్ సత్తయ్య, తాపీ మేస్త్రీ పనిచేసే రామవత్ దేవలా, కూలీ పనులు చేసే అంగోతు నీలావతి, కేతావత్ జానీ, నల్లగొండ జిల్లా చందంపేటకు చెందిన కూలీ పనులు చేసే కేతావత్ నాన్కు, దేవరకొండ మండలం షేర్‌పల్లికి చెందిన రామవత్ పద్మతో పాటు ముగ్గురు మైనర్లు కలసి ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా కలిసి గత రెండు నెలల్లో చిట్యాల మండలం వట్టిమర్తి, వెలిమినేడు గ్రామాల్లో, కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలో, యాద్రాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట, మోత్కూరులో, దత్తప్పగూడెం, అనాజీపురం గ్రామాల్లో ఇళ్లు, దుకాణాల నిర్మాణాలకు ఉపయోగిస్తున్న సెంట్రింగ్ మెటీరియల్‌ను చోరీ చేశారు.

**చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు..**

ముఠా సభ్యులంతా కలిసి చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో గురువారం తెల్లవారుజామున చింతపల్లి నర్సింహ నిర్మిస్తున్న ఇంటికి ఏర్పాటు చేసిన సెంట్రింగ్ మెటీరియల్‌ను చోరీ చేసేందుకు వచ్చారు. సెంట్రింగ్ మెటీరియల్‌ను అశోక్ లేలాండ్ వాహనంలోకి లోడ్ చేస్తున్న క్రమంలో శబ్ధం రావడంతో పక్కనే ఉంటున్న చింతపల్లి నర్సింహ ఇంట్లోంచి బయటికి వచ్చి గట్టిగా అరిచాడు. దీంతో దొంగల ముఠా అప్పటికే లోడ్ చేసుకున్న సెంట్రింగ్ మెటీరియల్‌తో పరారయ్యారు. సెంట్రింగ్ మేస్త్రీ మెట్టు క్రిష్ణయ్య చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చిట్యాల ఎస్‌ఐ డి. సైదాబాబు ఆధ్వర్యంలో పోలీసుల బృందం శుక్రవారం తెల్లవారుజాము నుంచి హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించగా.. చిట్యాలలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో సెంట్రింగ్ మెటీరియల్ లోడ్‌తో వెళ్తున్న ఈ దొంగల ముఠా పట్టుబడింది. వారి నుంచి రూ.2లక్షల విలువైన 120 సెంట్రింగ్ బాక్స్‌లు, ప్లేట్‌లు, అశోక్ లేలాండ్ వాహనం, రెండు సెల్‌ఫోన్లతో పాటు రూ.4లక్షల నగదు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన చిట్యాల ఎస్‌ఐ డి. సైదాబాబు, హెడ్ కానిస్టేబుళ్లు ఎస్‌కే అహ్మద్, కానిస్టేబుళ్లు నాగరాజు, ఖలీం, సాయికుమార్, లింగయ్య, చిన్నబాబు, వరలక్ష్మి, హోంగార్డులు సందీప్, శ్రీనును డీఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో సీఐ కె. నాగరాజు, ఎస్‌ఐ డి. సైదాబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సూర్యాపేట
శనివారం । 17 । ఫిబ్రవరి । 2024




**ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు**
చెర్వుగట్టులో శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి.
- IIలో



**చోరీల ముఠా అరెస్ట్**
ఇళ్ల సెంట్రింగ్ మెటీరియల్‌ను అపహరిస్తున్న దొంగల ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు.
- IIలో



**అధ్యయనోత్సవాలు**
యాదాద్రి శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అధ్యయనోత్సవాలు కొనసాగుతున్నాయి.
- IIలో

## న్యూస్‌రీల్

### నేడు ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

**సూర్యాపేటటౌన్:** టాస్క్ ఆధ్వర్యంలో అన్‌స్కూల్ కంపెనీ వారిచే శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు ముత్యాల, డైరెక్టర్ డాక్టర్ డి.కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌కు 2024లో బీటెక్, డిగ్రీ పూర్తి చేయనున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.5లక్షల వరకు ఉంటుందని తెలిపారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### కలెక్టర్‌ను కలిసిన జిల్లా అధికారులు



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న జెడ్పీసీఈఓ అప్పారావు

**దురాజ్‌పల్లి (సూర్యాపేట):** ఎన్నికల బదిలీలో భాగంగా జిల్లాకు కేటాయించిన పలువురు జిల్లా అధికారులు శుక్రవారం కలెక్టర్ వెంకట్రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారిలో జెడ్పీసీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, ఇన్‌చార్జ్ సీపీఓ శ్రీనివాస్, డిప్యూటీ సీఈఓ శిరీష ఉన్నారు.

### గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

**సూర్యాపేట రూరల్:** ఇటీవల సూర్యాపేట మండలంలోని ఇమాంపేట గురుకుల పాఠశాలలో బైపీసీ సెకండ్ ఇయర్ విద్యార్థిని డి వైష్ణవి ఆత్మహత్య చేసుకున్నందుకు గాను పలు ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రిన్సిపాల్‌ను విచారణ చేస్తున్నామని టీఎస్‌డబ్ల్యూ ఆర్ఈఐ సొసైటీ నల్లగొండ రీజనల్ అధికారి తెలిపారు.

### పేట మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

**సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపల్ కమిషనర్‌గా బి.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పట్టణ ప్రజలు అందరూ సహకరించాలని కోరారు.

### యాదాద్రిలో ఊంజలి సేవ



అమ్మవారి సేవను ఊరేగిస్తున్న అర్చకులు

**యాదగిరిగుట్ట :** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఊంజలి సేవ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు, మాఢ వీధుల్లో భక్తుల సేవను ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారి సేవను అధిష్టించి ఊంజలి సేవోత్సవం జరిపించారు. ఆండాళ్ అమ్మవారికి ఇష్టమైన నాధస్వరాన్ని వినిపించారు. ఇక శ్రీస్వామి ప్రధానాలయంలో శ్రీస్వామి, అమ్మవారికి సంప్రదాయ పూజలు కొనసాగాయి.

### మట్టపల్లిలో నిత్యకల్యాణం

**మఠంపల్లి:** మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శుక్రవారం అర్చకులు వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం చేసి స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రక్తికట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుఫర్కపూజ అనంతరం మాంగళ్యధారణ గావించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూర్ల మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

## ● కార్మికుల పోరు బాట



కేంద్రం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా శుక్రవారం సూర్యాపేట బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు




కోదాడలో గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న అఖిల పక్ష రైతు సంఘాల నాయకులు

### 24 నుంచి టీసీసీ పరీక్షలు

**సూర్యాపేటటౌన్ :** టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఎగ్జామినేషన్‌లో డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని నాలుగు సెంటర్లలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, మ ధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. టైలరింగ్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు వారి వెంట కుట్టు మిషన్ తీసుకుని రావాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

# ఆ భూములు ఏ శాఖవి?

- నెమలిపురి, వజినేపల్లి సరిహద్దు భూములపై ఫారెస్ట్, రెవెన్యూ శాఖల మధ్య స్పష్టత కరువు
- గతంలో వజినేపల్లి రెవెన్యూ భూముల్లో రైతులకు పట్టాలు
- ఈ భూములు అటవీ శాఖవని స్వాధీనం చేసుకున్న అధికారులు
- సరిహద్దు వివాదంతో ఏళ్లుగా సాగుతున్న పంచాయితీ



**దురాజ్‌పల్లి (సూర్యాపేట):** ఫారెస్ట్, రెవెన్యూ శాఖల భూ పంచాయితీ పట్టాలున్న రైతులకు భూములు లేకుండా చేసింది. చింతలపాలెం మండల పరిధిలో నెమలిపురి, వజినేపల్లి గ్రామాల భూములపై రెండు శాఖల మధ్య ఏర్పడ్డ భూ వివాదం కొందరు రైతులకు శాపంగా మారింది. ఈ గ్రామాల్లోని భూములు తమ శాఖకే చెందుతాయని రెండు శాఖలు వాదిస్తున్నాయి. రెండు గ్రామాల భూములపై ఏళ్లగా వివాదం కొనసాగుతోంది.

**రెండు సర్వే నంబర్లు పక్కపక్కనే ఉండటంతో..**

చింతలపాలెం మండలం వజినేపల్లి గ్రామంలో రెవెన్యూ రికార్డు ప్రకారం సర్వే నంబర్ 52లో 636 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ సర్వే నంబర్‌లో 1988లో కుటుంబ నియంత్రణ చేయించుకున్న 40 కుటుంబాలకు 3 ఎకరాల చొప్పున 120 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఇదే మండలం నెమలిపురిలో సర్వే నంబర్ 316లో అగ్రహారానికి చెందిన రెవెన్యూ భూములను 1962లో హైదరాబాద్ ఫారెస్ట్ యాక్ట్ కింద సర్వే నంబర్ 318గా మార్చుతూ అటవీ భూములకు కేటాయించారు. ఇక్కడ రికార్డుల ప్రకారం తమశాఖకు 1989 ఎకరాల భూమి ఉన్నదని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఈ రెండు సర్వే నంబర్లు పక్కపక్కనే ఉండటంతో సరిహద్దు వివాదం మొదలైంది. వజినేపల్లి గ్రామంలోని సర్వే 52లో గల రెవెన్యూ భూములను ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ తమ భూములుగా చూపిస్తూ ఈ సర్వే నంబర్‌లోని మొత్తం భూమిని వారి ఆధీనంలోకి తీసుకున్నారు. అంతేకాకుండా ఈ సర్వే నంబర్‌లో పట్టాలు పొందిన రైతులను భూమిపైకి రాకుండా అడ్డుకుంటున్నారు. అయితే నెమలిపురి గ్రామంలోని సర్వే 316లో ఎంత భూమి ఉందో తెలియకుండానే రికార్డులో నమోదైన ప్రకారం 318 సర్వేగా మార్చి అటవీ శాఖకు కేటాయించడంతో ఈ వివాదం వచ్చిందని, ఈ సర్వే నంబర్‌లో రికార్డుల్లో ఉన్నంత భూమి స్థానికంగా లేదని, కానీ రికార్డుల ప్రకారం రెండు గ్రామాల సరిహద్దులను అటవీ శాఖ ఓవర్‌లాప్ చేసినట్లు రెవెన్యూశాఖ అధికారులు ఆరోపిస్తున్నారు.

**ఏళ్లుగా సాగుతున్న వివాదం..**

వజినేపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 52లో పట్టాలు పొందిన రైతులు కొన్ని సంవత్సరాల పాటు భూములను సాగు చేసుకున్నారు. 2014 తరువాత భూములపైకి ఫారెస్ట్ అధికారులు వస్తుండటంతో 2018లో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో 1962లో రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం సరిహద్దు రాజీనామా చేసుకోవాలని హైకోర్టు సూచించినట్లు సమాచారం. హైకోర్టు ఆదేశాల ప్రకారం 2020లో రెండుశాఖలు సరిహద్దు రాజీనామా చేసి లాండ్ సర్వే శాఖ కమిషనర్‌కు రిపోర్టు అందించారు. 2023 జనవరిలో సెక్షన్ 90 ప్రకారం రైతులకు పట్టాలు ఇస్తూ ఆన్‌లైన్లో నమోదు చేయాలని లాండ్ సర్వే శాఖ కమిషనర్ ఆదేశించారు. కానీ నేటికీ ఈ సమస్యపై రెండు శాఖల మధ్య వివాదం మాత్రం కొనసాగుతూనే ఉంది. కలెక్టర్ స్పందించి గతంలో తమకు కేటాయించిన భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేసి నూతన పట్టాలు ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

**ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాలు ఇవ్వాలి**

1988లో మా కుటుంబానికి వజినేపల్లి సర్వే 52లో ప్రభుత్వం కేటాయించిన 3 ఎకరాల భూమిని నాటి నుంచి సాగు చేసుకుంటున్నాం. 2014 తరువాత ఈ భూములు తమవని అటవీ శాఖ అధికారులు అంటున్నారు. అయితే కోర్టును ఆశ్రయించగా సర్వే చేసి రెవెన్యూ భూములుగా గుర్తించారు. కానీ నేటికీ ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదు.

– రాములు నాయక్

**అటవీ భూముల లెక్క చూపాలి**

మా రికార్డు ప్రకారం 318 సర్వే నంబర్‌లో ఉన్న 1360 ఎకరాల ఫారెస్ట్ భూమి చూపించాలని రెవెన్యూ అధికారులను అడుగుతున్నాం. కానీ వారు లెక్క చూపకుండా వజినేపల్లి సర్వే 52లోకి అటవీ భూమి సరిహద్దులు వచ్చాయని, సరిహద్దు ఓవర్ లాప్ అయిందని వాదిస్తున్నారు. కానీ మా భూమి లెక్క చూపడం లేదు.

– సతీశ్, డీఎఫ్‌ఓ

# అంగన్‌వాడీ కొలువులపై ఆశలు

- ఖాళీలను నింపే యోచనలో ప్రభుత్వం
- వివరాలు సేకరిస్తున్న అధికారులు
- యువతులకు లభించనున్న ఉద్యోగ అవకాశాలు

**హుజూర్‌నగర్ :** అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఖాళీగా ఉన్న కేంద్రాల్లో సిబ్బందిని భర్తీ చేయడం ద్వారా వాటిని సమర్థవంతంగా నడిపించవచ్చని భావిస్తోంది. దీంతో ఉపాధ్యాయురాళ్లు, సహాయకుల పోస్టుల భర్తీపై నిరుద్యోగ యువతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయో సంబంధిత సంక్షేమ శాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి ప్రకటన విడుదల కాగానే వాటి భర్తీకి దరఖాస్తులు సేకరించేలా అధికారులు సమాయత్తం అవుతున్నారు.

**5 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో..**

జిల్లాలో మొత్తం 23 మండలాలు, ఐదు మున్సిపాలిటీలు ఉండగా వాటిలో 5 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 1,209 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో గర్భిణులు 6,080 మంది ఉండగా, బాలింతలు 4,380 మంది ఉన్నారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 6 నెలలలోపు చిన్నారులు 4,561 మంది, 7 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 28,250 మంది ఉన్నారు. 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 18,612 మంది ఉన్నారు. ఇందుకుగాను మొత్తం 239 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. మొత్తం 1,209 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,126 మెయిన్, 83 మినీ కేంద్రాలు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం మినీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసిన విషయం తెలిసిందే. వాటిల్లో లబ్ధిదారుల సంఖ్యకు తగినట్లుగా సిబ్బంది అందుబాటులో లేరు. ఇటీవల మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో సహాయకుల పోస్టులూ పెరిగాయి. దీనిప్రకారం 59 ఉపాధ్యాయ పోస్టులు, 180 సహాయకుల (ఆయాల) పోస్టులు మొత్తం కలిపి 239 పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని జిల్లా అధికారులు జాబితా రూపొందించారు. అయితే కొన్ని కేంద్రాల్లో టీచర్, ఆయా లేకపోవడంతో సమీప కేంద్రాల వారికి ఇన్‌చార్జ్‌లకు బాధ్యతలు అప్పగించారు. దీంతో వాటి సేవల్లో అంతరాయం కలుగుతోంది. లబ్ధిదారులకు కూడా పోషకాహారం సరిగా అందకపోవడం, ఎన్‌హెచ్‌టీఎస్ (న్యూ హెల్త్ ట్రాకింగ్ సిస్టం) పోషణ ట్రాకర్‌లో వివరాల నమోదులో కూడా ఆలస్యం జరుగుతోంది. అంగన్‌వాడీల పోస్టుల భర్తీతో ఆయా సమస్యలు తీరడంతో పాటు యువతులకు నూతనంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

**ఖాళీల జాబితా సిద్ధం చేస్తున్నాం**



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎన్ని ఖాళీలు ఉన్నాయనే జాబితా సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం త్వరలో ఆయా ఉద్యోగ నియామకాల మార్గదర్శకాలను విడుదల చేస్తుంది. ప్రభుత్వ ఉత్తర్వులు, నియమ నిబంధనల ప్రకారం ఖాళీలను నింపేందుకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

– జ్యోతి పద్మ, జిల్లా సంక్షేమ అధికారి, సూర్యాపేట

**మారుతున్న విద్యార్హత..**

గతంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత కావాలని నిబంధన ఉండేది. తాజాగా అందిన మార్గదర్శకాల ప్రకారం విద్యార్హతను ఇంటర్మీడియట్‌కు పెంచుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సాంకేతిక వినియోగం, ఆన్‌లైన్ రికార్డుల నమోదు, ఆండ్రాయిడ్ మొబైల్ యాప్‌ల ద్వారా రోజువారీ కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వయసు 18 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలి. మొత్తం ఖాళీల్లో అర్హులైన సహాయకులు ఉంటే ఉద్యోగోన్నతుల ద్వారా ఆయా ఖాళీలను భర్తీచేస్తారు. మిగిలిన వాటిని నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు.

# పోస్టాఫీసులో ఆధార్ సేవలు



మాట్లాడుతున్న జిల్లా తపాలా సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

**హుజూర్‌నగర్:** ఆధార్ కార్డులో తప్పుల సవరణ, బయోమెట్రిక్ నమోదును పోస్టాఫీసులో చేసుకోవచ్చని జిల్లా తపాలా సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని తపాలా కార్యాలయంలో గ్రామీణ తపాలా ఉద్యోగులకు ఐపీపీబీ మొబైల్‌లో సీఈఎల్‌సీ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రతి ప్రభుత్వ పథకానికి ఆధార్ కార్డ్ ప్రధానమని చెప్పారు. గ్రామీణ తపాలా ఉద్యోగులను ఈ యాప్‌కు ఆపరేటర్లుగా నియమించినట్లు తెలిపారు. ఇక నుంచి అప్పుడే పుట్టిన పిల్లలకూ ఆధార్ నమోదు చేసుకోవచ్చని, ఆధార్‌లో తప్పుల, బయోమెట్రిక్ సవరణతోపాటు, మొబైల్ నంబర్ లింక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి సేవలకు నామమాత్రంగా రూ.50 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. పిల్లల ఆధార్ నమోదును ఉచితంగా చేయడం జరుగుతుందని ప్రతి పోస్టాఫీస్‌లో ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తపాలా అధికారులు రాజేష్ రెడ్డి, సందీప్, ఉద్యోగులు కోటయ్య, మతీన్, గ్రామీణ తపాలా ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఐదు మీసేవ కేంద్రాలు మంజూరు

**దురాజ్‌పల్లి:** జిల్లాలోని నాలుగు మండలాల్లో ఐదు మీసేవ కేంద్రాలు మంజూరు చేసినట్లు, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24 నాటికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వెంకట్రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేటలో మున్సిపల్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, హుజూర్‌నగర్‌లో పోస్టాఫీసు ఎదురుగా, తుంగతుర్తి, కోదాడలో మొత్తం ఐదు నూతన మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం, డిగ్రీ ఆపై విద్యార్హతలు కలిగి, 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు కలెక్టరేట్‌లోని ఇన్‌వార్డ్ విభాగంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

# క్రీడాకారులు జిల్లాకు పేరు ప్రతిష్టలు తేవాలి



కబడ్డీ జిల్లా జట్టుకు టీషర్టులు అందజేస్తున్న రామచంద్రగౌడ్

**హుజూర్‌నగర్ :** కబడ్డీ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ రామచంద్రగౌడ్, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు దేవరం రవీందర్‌రెడ్డి అన్నారు. చింతలపాలెం మండలంలో నిర్వహించే 33వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు హాజరయ్యే జిల్లా బాలుర, బాలికల కబడ్డీ జట్లకు ప్రత్యేక్ష శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. శిక్షణలో 20మంది చొప్పున బాల బాలికలు పాల్గొనగా వారి నుంచి ప్రధాన జట్టుకు 12మందిని ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారులకు శ్రీ వివేకవర్ధిని గోశాల నిర్వాహకులు దేవరం రాజ్యలక్ష్మీ రవీందర్‌రెడ్డి క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కోచ్‌లు కస్తాల సునీల్‌కుమార్, మేనేజర్ వల్లమూడి మస్తాన్, రామిశెట్టి మురళి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ బాలకృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

# భళా.. బాల శాస్త్రవేత్తలు

- ఇటీవల ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ మనక్ పోటీల నిర్వహణ
- జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ఐదు ప్రాజెక్టులు ఎంపిక

**సూర్యాపేటటౌన్:** బాల్య దశలోనే విద్యార్థులను విజ్ఞానం వైపు మళ్లించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వైజ్ఞానిక మేళాలు, ప్రేరణ కార్యక్రమాలు చేపడుతోంది. ఇటీవల జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా ఇన్‌స్పైర్ మనక్ నిర్వహించారు. ఈ పోటీలో జిల్లా నుంచి 60 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రాజెక్టుల నమూనాల కోసం ఒక్కో విద్యార్థికి రూ.10వేల చొప్పున విడుదలయ్యాయి. వీరు ఇన్‌స్పైర్ మనక్ పోటీలో పాల్గొనగా ఐదు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు జిల్లా సైన్స్ అధికారి ఎల్.దేవరాజు తెలిపారు.

### సైకిల్ ద్వారా విత్తనాలు నాటే యంత్రం

విద్యార్థి : సీహెచ్.పావని
గైడ్ టీచర్ : బి.సర్దార్‌సింగ్
స్కూల్: జెడ్పీహెచ్‌ఎస్, పాత సూర్యాపేట

ఒక సైకిల్‌ను తీసుకొని దానికి ముందు వీల్‌కు నాలుగు పారలు అమర్చాలి. మధ్యలో ఒక బొంగు ఏర్పాటు చేసి దానిలో విత్తనాలు నింపాలి. ఒక వ్యక్తి సైకిల్ నెట్టుకొంటు వెళ్తుంటే ముందు పారలు గుంతలు తీస్తాయి. ఆ గుంతల మధ్యలో ఉన్న బొంగులో నుంచి విత్తనాలు పడుతుంటాయి. సైకిల్ వెనుక వీల్‌కు ఇంకో పార అమర్చాలి. ఈ పార ఆ గుంతలను పూడ్చుకుంటూ వెళ్తుంది. దీని వల్ల నలుగురు చేసే పని ఒక్కరే చేసుకోవచ్చు.



సైకిల్ ద్వారా విత్తనాలు నాటే యంత్రం చూపుతున్న విద్యార్థి, గైడ్ టీచర్

### వాటర్ ప్రూఫ్ స్కూల్ బ్యాగ్ విత్ సీటింగ్ చైర్

విద్యార్థి పేరు : చల్లా శోభన్‌బాబు
గైడ్ టీచర్ : ఎం.వెంకటేశ్వర్లు
స్కూల్ : బండరామారం జెడ్పీహెచ్‌ఎస్



ఒక వాటర్ ప్రూఫ్ బ్యాగ్ తీసుకొని దానికి పీవీసీ పైపులు రింగులా చేసి, బ్యాగ్‌కు పైపులు చైర్ వలే అటాచ్ చేశారు. బ్యాగ్ వేసుకొని స్కూల్‌కు వెళ్లేటప్పుడు మధ్యలో అలసిపోయినట్లయితే ఆ చైర్‌లో కొద్ది సేపు కూర్చొని సేద తీరొచ్చు.

### లైఫ్ సేవింగ్ స్టిక్

విద్యార్థి : ఎం.ప్రేమ్‌కుమార్
గైడ్ టీచర్ : రవీందర్‌రెడ్డి
స్కూల్ : కర్విరాల మోడల్ స్కూల్, నడిగూడెం మండలం



లైఫ్ సేవింగ్ స్టిక్

రైతులు రాత్రి పూట పొలం దగ్గరకు వెళ్లేటప్పుడు ఈ లైఫ్ సేవింగ్ స్టిక్ ఉపయోగపడుతుంది. ఈ స్టిక్‌ను తయారు చేయడానికి సుమారు మూడు ఫీట్ల పొడవు ఉన్న ఒక పీవీసీ పైపును తీసుకొని దానికి బ్యాటరీలు, వైబ్రేషన్ వచ్చేందుకు సెన్సార్, ఎల్‌ఈడీ లైట్‌లు అమర్చారు. రాత్రి పూట పొలంలో తిరుగుతున్నప్పుడు ఆ స్టిక్ ఉంటే రైతులకు దారి కనబడుతుంది. స్టిక్ వైబ్రేషన్ చేయడంతో దారిలో ఏమైనా విష పురుగులు ఉంటే పక్కకు వెళ్లిపోతాయి.

### పాత్ హోల్ డిటెక్షన్ కెమెరా టు వెహికిల్స్ ఆన్ కచ్చా రోడ్

విద్యార్థి పేరు : జకటి యనోష్
గైడ్ టీచర్ : కె.గురుమూర్తి
స్కూల్ : గట్టికల్ జెడ్పీహెచ్‌ఎస్

మనం నిత్యం రోడ్లపై ప్రమాదాలు చూస్తూనే ఉంటాం. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. వాటిలో రోడ్లపై ఏర్పడ్డ గుంతలను దూరం నుంచి డ్రైవర్ సరిగా చూడలేక పోవడం ఒక కారణం. దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలను నివారించడానికి వాహనాల ముందు కింది భాగాన కెమెరా అమర్చి దానికి క్యాబిన్‌లో అమర్చిన స్క్రీన్‌లో చూసి ఆ గుంతలను తప్పిస్తూ వాహనాన్ని నడిపి ప్రమాదాలను నివారించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం.



పాత్ హోల్ డిటెక్షన్ కెమెరా టు వెహికిల్స్ ఆన్ కచ్చా రోడ్ ప్రాజెక్టు

### వెజిటేబుల్ డ్రయర్ విత్ ఇన్‌డైరెక్ట్ సోలార్ ఎనర్జీ

విద్యార్థి పేరు : ఎం.గాయత్రి
గైడ్ టీచర్ : ఎస్.శ్రీనివాసరావు
స్కూల్: నర్సింహులగూడెం, జెడ్పీహెచ్‌ఎస్

ఈ పరికరాన్ని చెక్క, గ్లాస్, ఇనుముతో తయారు చేశారు. ఈ పరికరంతో కూరగాయలు, ఒరుగులు, చేపలు, మాంసం వంటివి త్వరగా ఎండబెట్టుకోవచ్చు. ఎండకు అనువుగా అటు ఇటు కదల్చనవసరం లేదు. ఎలాంటి కాపలా అవసరం లేదు. కోతులు, పక్షులు, కీటకాలు, దుమ్ము నుంచి రక్షణ కల్పిస్తుంది. ప్రతి ఇంటిలో తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చు. నిర్వహణ ఖర్చు ఏమీ ఉండదు.



వెజిటేబుల్ డ్రయర్ విత్ ఇన్‌డైరెక్ట్ సోలార్ ఎనర్జీ ప్రాజెక్టు

## క్లుప్తంగా

### స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా సుధీర్‌రెడ్డి



తిరుమలగిరి: తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన సంకెపల్లి సుధీర్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా నియమించింది. ఆయన ఫైనాన్స్ కమిషన్‌లో రెండు సంవత్సరాలు సభ్యుడిగా ఉంటారు. ప్రస్తుతం సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### చెట్టు పైనుంచి పడి యువకుడు మృతి

బీబీనగర్: చెట్టు పైకి ఎక్కి చింతకాయలు తెంపుతున్న యువకుడు కాలుజారి కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం బీబీనగర్ మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన పెరుమాళ్ల ఉపేందర్(28) శుక్రవారం తన ఇంటి సమీపంలో చింతచెట్టు ఎక్కి చింతకాయలు తెంపుతుండగా కాలుజారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఉపేందర్‌ను స్థానికులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### కారు ఢీకొని మహిళ దుర్మరణం

మిర్యాలగూడ: నడుచుకుంటూ వెళ్తున్న మహిళను కారు ఢీకొనడంతో మృతిచెందింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి దామరచర్ల మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన కోటేశ్వరి (48) నడుచుకుంటూ అద్దంకి-నార్కట్‌పల్లి రహదారి దాటుతుండగా అదే సమయంలో మిర్యాలగూడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కోటేశ్వరికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు కోటేశ్వరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### విద్యుదాఘాతంతో రైతు మృతి



లింగయ్య మృతదేహం

పెన్‌పహాడ్: వ్యవసాయ పొలం వద్ద బోరు మోటారు ఆన్ చేసేందుకు వెళ్లిన రైతు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండలం మహ్మదాపురంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మదాపురం గ్రామానికి చెందిన బొలిశెట్టి లింగయ్య(66) శుక్రవారం తన సొంత వ్యవసాయ పొలంలో బోరు మోటారు ఆన్ చేసేందుకు వెళ్లాడు. మోటారు ఆన్ చేసిన తర్వాత నీరు రాకపోవడంతో బోరు మోటారు పైపును పట్టుకోగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పొలం వద్దకు వెళ్లిన లింగయ్య ఎంతసేపయినా రాకపోయేసరికి అతడి భార్య కమలమ్మ వెళ్లి చూడగా.. లింగయ్య విగతజీవిగా పడి ఉన్నాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# కనుల పండువగా రథసప్తమి వేడుకలు

- తిమ్మాపురం సూర్యనారాయణస్వామి క్షేత్రానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- క్షేత్రాన్ని సందర్శించిన శ్రీకామాక్షి భక్తి ప్రచార పీఠం పీఠాధిపతి విద్యానరేంద్ర సరస్వతి స్వామి



స్వామివారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు



విద్యానరేంద్ర సరస్వతి స్వామి



స్వామివారి పాదాలను తాకిన సూర్యకిరణాలు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని సూర్యనారాయణస్వామి క్షేత్రంలో శుక్రవారం రథసప్తమి వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం సూర్యకిరణాలు సూర్యనారాయణస్వామి పాదాలను తాకాయి. సుప్రభాత సేవ, అభిషేకం, అలంకరణ అనంతరం భక్తులకు స్వామి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్త బృందాలచే భజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా క్షేత్రానికి తరలివచ్చిన సుమారు పదివేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కాగా రథసప్తమి వేడుకల్లో శ్రీకామాక్షి భక్తి ప్రచార పీఠం పీఠాధిపతి విద్యానరేంద్ర సరస్వతి స్వామి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ప్రవచనాలు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు నుంచి అంబికా దర్బార్ సంస్థ వారు పంపిన ఐదు అడుగుల అంబికా దర్బార్ అగర్బత్తిని వెలిగించారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన్‌స్వామి, కర్నాటి నాగేశ్వర్‌రావు, దేవరశెట్టి వెంకటేశ్వర్లు, గణపురం నరేష్, బాలమురళీకృష్ణ, గిరిధర్, మణికంఠ, వేదపండితుడు మూర్తి శ్రీనివాసశర్మ, అర్చకులు పాల్గొన్నారు.

## యాదాద్రిలో వైభవంగా రథసప్తమి



రథసప్తమిని పురస్కరించుకొని యాదాద్రిలో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లు



తూర్పు రాజగోపురం ముందు రథసప్తమి వేడుక విశిష్టతను వివరిస్తున్న ఆలయ ప్రధానార్చకులు

# ప్రత్యేక పూజలతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న ఆర్డీఓ రవి, డీఎస్పీ శివరాంరెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప



విద్యుత్ దీపాల వెలుగుల్లో చెర్వుగట్టు మెట్ల మార్గం

నార్కట్‌పల్లి: రథసప్తమి సందర్భంగా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో కొలువైన శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. నల్లగొండ ఆర్డీఓ రవి, డీఎస్పీ శివరాంరెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప తదితరులు ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకుడు రామలింగేశ్వరశర్మ, అర్చక బృందం పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచం, దీక్షాదహణ, ఏకాదశ రుద్రాభిషేకం, నీరాజన మంత్ర పుష్పములు వంటి పూజలతో వేద పండితుడు అల్లవరపు సుబ్రహ్మణ్య శాస్త్రి, నీలకంఠ శర్మ, దేవాలయ ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ, సురేశ్‌శర్మ, శ్రీకాంత్ శర్మ, సతీష్, నాగయ్య బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆర్డీఓ రవి, డీఎస్పీ శివరాంరెడ్డి మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మహేంద్ర కుమార్, కార్యనిర్వహణ అధికారి నవీన్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మాజీ సర్పంచ్ నేతగాని కృష్ణ, వారాల రమేష్, వడ్డే భూపాల్‌రెడ్డి, గడుసు శశిధర్‌రెడ్డి, పున్నపురాజు యాదగిరి, రేగట్టె నవీన్‌రెడ్డి, రేగట్టె నర్సింరెడ్డి, మల్గ శంకర్, బండమీది లింగయ్య తదితరులు పాల్గొన్నారు. శనివారం తెల్లవారు జామున స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

### భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి అధికారులకు సూచించారు. చెర్వుగట్టులోని శ్రీపార్వతీజడల రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఆమె దేవస్థానానికి వచ్చి గట్టు పైన, కింద వివిధ ప్రదేశాలు, కల్యాణ మండపం ప్రాంతాన్ని పరిశీలించారు. కల్యాణం ఏర్పాట్లపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట డీఎస్పీ శివరాంరెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్ర కుమార్, ఆలయ అధికారి నవీన్‌కుమార్, సీఐ నాగరాజు, ఎస్ఐ అంతిరెడ్డి ఉన్నారు.



చెర్వుగట్టులో అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ చందనా దీప్తి

# కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు



ఆలయంలో పారాయణం పఠిస్తున్న ఆచార్యులు, పారాయణీకులు



స్వామి వారి సేవను ఆలయ పుర వీధిలో ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం ఆలయాన్ని తెరచిన ఆచార్యులు.. నిత్యారాధనలు జరిపించి, తిరుమంజన మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అలంకరించి పురప్పాట్ సేవను ఆలయ పుర వీధిలో ఊరేగించారు. సాయంత్రం నిత్యారాధనలు జరిపించిన తర్వాత దివ్య ప్రబంధ సేవా కాలం నిర్వహించి, స్వామి, అమ్మవారు, ఆళ్వారుల పురప్పాట్ సేవను నిర్వహించారు. ఆయా వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, ఆలయాధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సప్త వాహనాలపై ఊరేగింపు

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామిని సప్త వాహనాలపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలుచేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



సింహవాహనంపై నృసింహస్వామి, అమ్మవార్లు

# బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరు మృతి



మద్దెల శ్రీను (ఫైల్)



రాంబాబు (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో గురువారం రాత్రి జరిగింది. వివరాలు.. మిర్యాలగూడలోని నందిపాడు సమీపంలో గల నవనీత వైన్స్ పర్మిట్ రూంలో శాంతినగర్‌కు చెందిన రుద్రాక్ష రాంబాబు(38), మద్దెల శ్రీను(26) సప్లయర్స్‌గా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి తమ విధులు ముగించుకుని వారిద్దరు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి నందిపాడు క్రాస్ రోడ్డు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబు, శ్రీను అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ కనకేష్‌ను అదుపులోకి తీసుకుని కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతుడు రాంబాబుకు భార్య విజయలక్ష్మి, కుమార్తె అంజలి, కుమారుడు అనిల్ ఉన్నారు. మద్దెల శ్రీను స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా పులివెందుల దగ్గర ఓ గ్రామం కాగా మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డలో ఉంటున్నట్లు తెలిసింది. రాంబాబు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు.

### లారీ ఢీకొని..



శంకర్ (ఫైల్)

భువనగిరి క్రైమ్: బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందారు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి పట్టణంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్‌లోని చిలకానగర్‌కు చెందిన కడియాల శంకర్(48) ఇళ్లలో టైల్స్ వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం భువనగిరి పట్టణంలోని టీచర్స్ కాలనీ వద్ద పనులు ముగించుకుని హబ్సిగూడకు చెందిన చంద్రశేఖర్‌తో కలిసి బైక్‌పై ఉప్పల్‌కు వెళ్తుండగా భువనగిరి పట్టణంలోని చెరువు కట్ట వద్ద లారీ ఒక్కసారిగా బైక్ పైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతిచెందగా, చంద్రశేఖర్‌కు గాయాలయ్యాయి. శంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### చికిత్స పొందుతూ యువకుడు మృతి

మోత్కూరు: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడి గాయాలపాలైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. వివరాలు.. మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన వంగాల బుద్రుడు (35) బుధవారం బైక్‌పై వెళ్తూ మోత్కూరు మండలంలోని పనకబండ సమీపంలో అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. శుక్రవారం బుద్రుడు భౌతికకాయానికి యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు దాసరి తిరుమలేష్, జిట్ట సాయికుమార్, దాసరి నవీన్‌కుమార్ తదితరులు నివాళులర్పించారు.

### ఐదుగురు జూదరుల అరెస్ట్

దేవరకొండ: మండల పరిధిలోని తాటికోల్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు. వారి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, రూ.64,640 నగదుతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

# రిజర్వు ఫారెస్ట్‌లో మైనింగ్‌పై వివరణ ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: సూర్యాపేట జిల్లా మఠంపల్లి పరిధిలోని సుల్తాన్‌పూర్ రిజర్వు ఫారెస్ట్ ఏరియాలో అక్రమ మైనింగ్ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు అధికారులకు నోటీసులు జారీ చేసింది. సాగర్ సిమెంట్స్ మైనింగ్ విస్తరణ కోసం నిర్వహిస్తున్న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కొనసాగించవచ్చునని చెబుతూనే.. కోర్టు అనుమతి లేకుండా దానిపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోవద్దని స్పష్టం చేసింది. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మఠంపల్లి, పెద్దవీడు గ్రామాల్లో 328 ఎకరాల్లో సాగర్ సిమెంట్స్ మైనింగ్ లీజు పెంపు ప్రతిపాదనపై ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) గత నెల నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ మఠంపల్లి మండలానికి చెందిన పద్మతో పాటు 11 మంది హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. సాగర్ సిమెంట్స్ మైనింగ్ విస్తరణ చేపట్టిన 326 ఎకరాల ప్రాంత పరిధిలో రామచంద్రాపురం, గుర్రంబోడు, అంతియా, దుబ్బ, కాల్వపల్లి, దొనబండ, జామ్ల, సుల్తాన్‌పురం తదితర 33 తండాలున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది గోవింద్ తెలిపారు. అటవీ ప్రాంతంలో సాగర్ సిమెంట్స్ మైనింగ్ నిర్వహిస్తోందని, అది అక్కడి వారి జీవనోపాధిపై ప్రభావం చూపుతుందని.. ఆ లీజును రద్దు చేయాలంటూ గనుల శాఖ డైరెక్టర్‌కు అటవీశాఖ అధికారి లేఖ రాశారన్నారని చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణను నిలిపివేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. గిరిజనుల జీవితాల అంశంతో ముడిపడి ఉన్నందున ప్రభుత్వం స్పందించేదాకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోరాదని స్పష్టం చేసింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు పలువురు అధికారులకు, అలాగే సాగర్ సిమెంట్స్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా చేసింది.

# మత్తు ఇంజెక్షన్ వికటించి బాలిక మృతి !

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన



బాలిక మృతదేహం

మిర్యాలగూడ అర్బన్: కాలు విరిగిందని ఆస్పత్రికి వెళ్తే ఆపరేషన్ చేసేందుకు డాక్టర్ మత్తు ఇంజెక్షన్ ఇవ్వగా అది వికటించి బాలిక మృతిచెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటన మిర్యాలగూడలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం ఇర్కిగూడెం గ్రామానికి చెందిన దాసరి యల్లయ్య కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 14న తమ సమీప బంధువుల ఇంట్లో పండుగ ఉండగా యల్లయ్య కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో యల్లయ్య కుమార్తె మీనాక్షి(9) కాలు విరిగింది. దీంతో వెంటనే బాలికను మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డికాలనీలో గల సాయి ఎముకల వైద్యశాలకు తీసుకెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యుడు డాక్టర్ శ్రీనివాసరాజు ఆమె కాలుకు ఆపరేషన్ చేయాలని సూచించాడు. శుక్రవారం ఉదయం బాలికను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లిన వైద్యుడు అనస్తీషియా డాక్టర్ పర్యవేక్షణ లేకుండానే బాలికకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మత్తు ఇంజెక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే బాలిక అపస్మారకస్థితిలోకి పోవడంతో ఆపరేషన్ థియేటర్ నుంచి బయటకు వచ్చిన వైద్యుడు బాలిక పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని చెప్పి స్వయంగా అంబులెన్స్ ఏర్పాటు చేశాడని, బాలికను హైదరాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందిందని కుటుంబ సభ్యులు బోరు విలపించారు. డాక్టర్ ఎక్కువ మొత్తంలో మత్తు మందు ఇవ్వడంతోనే బాలిక మృతిచెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం రాత్రి బాలిక మృతదేహాన్ని మిర్యాలగూడకు తీసుకొచ్చి ఆస్పత్రి ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు.

**రూ.5లక్షలకు రాజీ..**

ఆందోళన చేస్తున్న బాలిక కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు వైద్యులతో మధ్యవర్తులు చర్చలు జరిపేందుకు రంగంలోకి దిగారు. గంట వరకు చర్చలు జరిపిన తర్వాత బాలిక బంధువులు రూ.50లక్షలు డిమాండ్ చేయగా.. చివరకు రూ.5లక్షలు చెల్లించేందుకు మధ్యవర్తులు రాజీ కుదర్చడంతో ఆందోళన విరమించి బాలిక మృతదేహాన్ని తీసుకెళ్లారు.

# భార్య మృతికి కారణమైన భర్తకు జైలు శిక్ష

మిర్యాలగూడ టౌన్: భార్య మృతికి కారణమైన భర్తకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మిర్యాలగూడ ఐదవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జి. వేణు శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మణెమ్మకు అదే గ్రామానికి చెందిన గంధం బాలసైదులుతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. మూడేళ్ల పాటు వీరి కాపురం సజావుగానే సాగింది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు పుట్టారు. ఆ తర్వాత ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న బాలసైదులు తన భార్య మణెమ్మకు ఇతరులతో వివాహేతర సంబంధం కలిగి ఉందనే అనుమానంతో తరచూ ఆమెను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేయడంతో పాటు అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధించేవాడు. ఆ వేధింపులు తట్టుకోలేక 2016 డిసెంబరు 29న మణెమ్మ ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. కాలిన గాయాలతో మణెమ్మ మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అప్పటి న్యాయమూర్తి ఎం. పద్మజ వాంగ్మూలం తీసుకుంది. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం ఆమెను హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ 2017 జనవరి 3వ తేదీన మృతి చెందింది. దీంతో అప్పటి మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ కె. శ్రీకాంత్ నిందితుడు బాలసైదులుపై కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ రాంగోపాల్‌రావు దర్యాప్తు చేసి చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. అప్పటి న్యాయమూర్తి పద్మజకు మణెమ్మ ఇచ్చిన వాంగ్మూలంను పరిశీలించిన ప్రస్తుత మిర్యాలగూడ 5వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జి. వేణు నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. జరిమానా కట్టకపోతే మరో ఆరు నెలలు జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పీపీ మన్నెం మనోహర్‌రెడ్డి వాదించగా ప్రాసిక్యూషన్‌కు కోర్టు లైజన్ అధికారి సైదులు, కోర్టు కానిస్టేబుళ్లు కిషన్, జానకిరాములు సహకరించారు.

# సెంట్రింగ్ మెటీరియల్ చోరీ చేస్తున్న ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

చిట్యాల: ఇంటి స్లాబు నిర్మాణంలో వాడే సెంట్రింగ్ మెటీరియల్ ఎత్తుకెళ్తున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను చిట్యాలలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం డీఎస్పీ విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన ఐరన్ స్క్రాప్ వ్యాపారం చేసే సబావత్ సత్తయ్య, తాపీ మేస్త్రీ పనిచేసే రామవత్ దేవలా, కూలీ పనులు చేసే అంగోతు నీలావతి, కేతావత్ జానీ, నల్లగొండ జిల్లా చందంపేటకు చెందిన కూలీ పనులు చేసే కేతావత్ నాన్కు, దేవరకొండ మండలం షేర్‌పల్లికి చెందిన రామవత్ పద్మతో పాటు ముగ్గురు మైనర్లు కలసి ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా కలిసి గత రెండు నెలల్లో చిట్యాల మండలం వట్టిమర్తి, వెలిమినేడు గ్రామాల్లో, కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలో, యాద్రాది భువనగిరి జిల్లా రామన్నపేట, మోత్కూరులో, దత్తప్పగూడెం, అనాజీపురం గ్రామాల్లో ఇళ్లు, దుకాణాల నిర్మాణాలకు ఉపయోగిస్తున్న సెంట్రింగ్ మెటీరియల్‌ను చోరీ చేశారు.

**చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు..**

ముఠా సభ్యులంతా కలిసి చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో గురువారం తెల్లవారుజామున చింతపల్లి నర్సింహా నిర్మిస్తున్న ఇంటికి ఏర్పాటు చేసిన సెంట్రింగ్ మెటీరియల్‌ను చోరీ చేసేందుకు వచ్చారు. సెంట్రింగ్ మెటీరియల్‌ను అశోక్ లేలాండ్ వాహనంలోకి లోడ్ చేస్తున్న క్రమంలో శబ్దం రావడంతో పక్కనే ఉంటున్న చింతపల్లి నర్సింహా ఇంట్లోంచి బయటికి వచ్చి గట్టిగా అరిచాడు. దీంతో దొంగల ముఠా అప్పటికే లోడ్ చేసుకున్న సెంట్రింగ్ మెటీరియల్‌తో పరారయ్యారు. సెంట్రింగ్ మేస్త్రీ మెట్టు క్రిష్ణయ్య చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చిట్యాల ఎస్ఐ డి. సైదాబాబు ఆధ్వర్యంలో పోలీసుల బృందం శుక్రవారం తెల్లవారుజాము నుంచి హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించగా.. చిట్యాలలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో సెంట్రింగ్ మెటీరియల్ లోడ్‌తో వెళ్తున్న ఈ దొంగల ముఠా పట్టుబడింది. వారి నుంచి రూ.2లక్షల విలువైన 120 సెంట్రింగ్ బాక్స్‌లు, ప్లేట్‌లు, అశోక్ లేలాండ్ వాహనం, రెండు సెల్‌ఫోన్లతో పాటు రూ.4లక్షల నగదు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన చిట్యాల ఎస్ఐ డి. సైదాబాబు, హెడ్ కానిస్టేబుళ్లు ఎస్‌కే అహ్మద్, కానిస్టేబుళ్లు నాగరాజు, ఖలీం, సాయికుమార్, లింగయ్య, చిన్నబాబు, వరలక్ష్మి, హోంగార్డులు సందీప్, శ్రీనును డీఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో సీఐ కె. నాగరాజు, ఎస్ఐ డి. సైదాబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.